## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా : విద్యుత్ తీగలను తాకే చెట్ల కొమ్మలను తొలగింపు కారణంగా సోమవారం హాజారిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ధనరాజ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హజారిగూడెం సబ్‌స్టేషన్ 11కేవీ ఫీడర్ పరిధిలోని లైన్ వెంట ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆ ఫీడర్ పరిధిలో హజారిగూడెం, అలీనగర్ ప్రాంతాలకు ఉదయం 8.00 గంటల నుంచి 11.00గంటల వరకు, అదే విధంగా పులిమామిడి సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ పులిమామిడి ఫీడర్ పరిధిలో పులిమామిడి, మార్లగడ్డగూడెం, బంటువారిగూడెం ప్రాంతాలకు ఉదయం 7.00 గంటల నుంచి 11.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని గృహ, వాణిజ్య, వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

### జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా సునీత



మిర్యాలగూడ : గురుకులం ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ (జీపీఈటీఏ) సమావేశం ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. జీపీఈటీఏ అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా రీజినల్‌లకు సంబంధించి ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా మిర్యాలగూడ పీడీ సునీత నల్లగొండ రీజినల్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాలకు చెందిన ట్రైబల్ వెల్ఫేర్ గురుకులం పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

### గురుకుల ఇంటర్‌లో ప్రవేశానికి కౌన్సెలింగ్

కొండమల్లేపల్లి : పట్టణ పరిధిలోని ఎస్టీ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం 2025–25 ప్రవేశానికి ఈ నెల 16వ తేదీన ఉదయం 11 గంటలకు తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల మిర్యాలగూడ(అవంతిపురం)లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హాజరయ్యే విద్యార్థులు టెన్త్ మెమో, టీసీ, స్టడీ కండక్ట్, కుల, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్‌కార్డు జిరాక్స్, మూడు కలర్ పాస్ ఫోటోలు తీసుకురావాలని పేర్కొన్నారు.

### విత్తనాల సేకరణ



విత్తనాలు సేకరించిన గాంధీనగర్ యువకులు

మిర్యాలగూడ టౌన్ : వనజీవి రామయ్య స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణ కోసం పట్టణంలోని గాంధీనగర్ చెందిన యువకులు పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్‌లో ప్రస్తుతం వివిధ రకాలు మూడు లక్షల విత్తనాలను ఆదివారం సేకరించారు. ఈ సందర్భంగా గాంధీనగర్‌కు చెందిన యువకులు మాట్లాడుతూ పాత వ్యవసాయ మార్కెట్‌లో గానుగ విత్తనాలు, అల్పిభజియ లలెబ్బక్ విత్తనాలు సుమారు 5వేల వరకు సేకరించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి సమీపంలో మొక్కలు. ఈ కార్యక్రమంలో అవిరెండ్ల సందీప్‌కుమార్, దైద పవన్, ఉబ్బపల్లి రాజేష్, కందికంటి సైదులు, దైద సాయినాథ్, కందికంటి రమేష్, అవిరెండ్ల విజయ్, ఆర్ సైదులు తదితరులున్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

హాలియా : మదారిగూడెం గ్రామానికి చెందిన కుందారపు యాదగిరి ఇటీవల అకాల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న 2001–2002 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మృతిచెందిన గురువు యాదగిరి చిత్రపటానికి పూర్వ విద్యార్థులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆవుల శ్రీనివాస్, చెరుకు సైదులు, బైరు శ్రీను, రావుల రామాంజీ, చందా నాగేంద్ర, ఆవుల నాగలక్ష్మి పాల్గొన్నారు.

### నేడు విద్యా సదస్సు

నల్లగొండ: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించనున్న శేషు స్మారక విద్యా సదస్సును విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశం, ప్రధాన కార్యదర్శి పి.వెంకులు ఒక ప్రకటనలో కోరారు. సంఘం నాయకులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో ఈ సదస్సులో పాల్గొనాలని కోరారు.

# మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- నర్సరీల్లో గ్రీన్ మ్యాట్స్ ఏర్పాటు
- రూ.6 నుంచి రూ. 10వేల వరకు నిధుల కేటాయింపు
- పెద్దవూరలో 3.90 లక్షల మొక్కల పెంపకం



బట్టుగూడెంలో ఏర్పాటు చేసిన గ్రీన్ మ్యాట్స్



మొక్కలకు నీటిని అందిస్తున్న వన సంరక్షకుడు

పెద్దవూర : పల్లెల్లో పచ్చదనం పెంపొందించేందుకు గాను గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా నర్సరీల్లో వివిధ రకాల మొక్కల పెంపకాన్ని చేపడుతోంది. పదో విడత హరితహారానికి గ్రామాల్లోని నర్సరీల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది మొక్కలు పెంచుతున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున మొలకెత్తిన విత్తనాలు, మొక్కలు ఎండిపోకుండా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. పండ్లు, పూలు, నీడ నిచ్చే మొక్కలతో పాటు వివిధ రకాల మొక్కలను నాటి సంరక్షణ చర్యలు చేపడుతుంది. మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో నర్సరీలను ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని మొక్కలు ఎండిపోకుండా చర్యలు చేపడుతున్నారు. మొక్కల పెంపకంలో భాగంగా కవర్లలో విత్తనాలు నాటగా, మొక్కలు ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. మొక్కలు ఎండిపోకుండా ప్రతీరోజు నీటి తడులు అందిస్తున్నారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై చలువ పందిళ్లను(గ్రీన్ మ్యాట్స్) రక్షణ కోసం వేయిస్తున్నారు. చలువ పందిళ్ల కోసం ప్రభుత్వం మొక్కల సంఖ్యకు అనుగుణంగా ఒక్కో నర్సరీకి రూ.6 వేల నుంచి రూ.10వేల వరకు నిధులుకేటాయించింది. దీంతో మొక్కలు ఏపుగా పెరిగే అవకాశం ఉంది.

**ప్రతీ నర్సరీలో జీవామృతం తయారీ..**

నర్సరీల్లో మొక్కల సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ప్రతీ నర్సరీలో జీవామృతం తయారు చేయిస్తున్నారు. మొక్కలు చనిపోకుండా ఆరోగ్యంగా ఉండేందుకు గాను సేంద్రీయ ఎరువులను వినియోగిస్తున్నారు. ఎండ తీవ్రత కోసం నర్సరీల పైభాగాన చలువా పందిళ్లు వేయించారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో మొక్కలు వాడిపోకుండా పంచాయతీ సిబ్బందితో ట్యాంకర్లతో నీటిని పోయిస్తున్నారు.

**హరిత మండలం దిశగా..**

వర్షాలు సమృద్ధిగా కురవాలని, వాతావరణ సమతుల్యత కాపాడేందుకు, పల్లెలు పచ్చదనంతో ఉండాలన్న లక్ష్యంతో హరితహారానికి శ్రీకారం చుట్టారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 26 నర్సరీలను ఏర్పాటు చేశారు. పదో విడత హరితహారంలో భాగంగా ఒక్కో నర్సరీలో 15వేల చొప్పున మండలంలో మొత్తం 3లక్షల 90 వేల మొక్కలను నాటే లక్ష్యాన్ని అధికారులు నిర్దేశించారు. ప్రతీ గ్రామంలో మొక్కల సంరక్షణకు వన సేవకుడిని నియమించారు. వీరు నర్సరీల్లో విత్తనాలు వేసిన మొదలు మొక్కలుగా ఎదిగే వరకు చర్యలు తీసుకుంటున్నారు. మొక్కల మధ్య పెరిగిన కలుపును ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో మొలకెత్తని విత్తనాలను తొలగించి ఇతర మొక్కలు పెంచుతున్నారు. అందులో భాగంగా పండ్లు, పూలు, నీడనిచ్చే తదితర మొక్కలను పెంచుతున్నారు. జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, ఖర్జూర, అల్లనేరేడు, నేరేడు, వెలగ, ఉసిరి వంటి పండ్ల మొక్కలతో పాటు గులాబీ, కరివేపాకు, మందారం, రాగి, వేప, రేన్‌ట్రీ, అబూబియా, టేకోమా, గన్నేరు, మద్ది, కానుగ, మునగ, కృష్ణతులసితో పాటు 70 రకాలకు పైగా మొక్కలను పెంచి అవి ఎండిపోకుండా చర్యలు చేపడుతున్నారు.

**చర్యలు చేపట్టాం**

వేసవి కాలం దృష్ట్యా నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా గ్రీన్ మ్యాట్‌లు ఏర్పాటు చేయించాము. హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాము. ప్రతి ఒక్కరూ హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతలను తీసుకోవాలి.

-సుధీర్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ, పెద్దవూర

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న డబ్బికార్ మల్లేశ్

మిర్యాలగూడ అర్బన్ : కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న నిర్వహించే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో కార్మిక, కర్షక, రైతు కూలీ, వ్యవసాయ కూలీల, కార్మిక సంఘాల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. పోరాడి సాధించుకున్న చట్టాలను కార్మికులు ఐక్యంగా ఉండి కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, జగదీష్ చంద్ర, పాదూరి శశిధర్ రెడ్డి, పరశురాములు, రమేష్, పిల్లుట్ల సైదులు, రామారావు, సైదులు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దవూర : ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా నాయకుడు దొంతాల నాగార్జున అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందని విమర్శించారు. 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచిందని దుయ్యబట్టారు. లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, ఎనిమిది గంటల పనిదినాలను కొనసాగించాలని, రైతులకు గిట్టుబాటు ధరల చట్టం చేయాలని, ఉపాధి హామీ పనిని 200 రోజులకు పెంచి రూ.600లు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు దోరెపల్లి మల్లయ్య, నాయకులు ఊరె నాగయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

పెద్దవూర : మండలంలోని పాల్తీతండాకు చెందిన సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు పాల్తీ చంద్యానాయక్ ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడటంతో గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ఆదివారం పాల్తీతండాలోని చంద్యానాయక్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ పాల్తీ శ్రీను నాయక్, రిటైర్డ్ ఏటీడీఓ లాల్‌సింగ్, నాయకులు పగడాల నాగరాజు, సల్ల హన్మంతరెడ్డి ఉన్నారు.



చంద్యాను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

## మిస్ వరల్డ్ పోటీలను విరమించుకోవాలి

మిర్యాలగూడ అర్బన్ : హైదరాబాద్ వేదికగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీలను విరమించుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వరలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అందాల పోటీల పేరులో ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని, ఈ పోటీలను ఎవరి కోసం నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. శ్రమైక జీవన సౌందర్యానికి ప్రాధాన్యత ఇచ్చే మహిళలను తల్లిగా, చెల్లిగా గౌరవించే ఈ దేశంలో అర్ధనగ్నంగా, అందాలను కొలిచి సౌందర్యవంతులుగా ప్రకటించే మిస్‌వరల్డ్ పోటీలను ఈ దేశపు మహిళలు ఏ మాత్రం సహించరని, ఇది వారి ఆత్మగౌరవానికి భంగకరమైనదన్నారు. దేశంలో ఇంకా 26శాతం అక్షర జ్ఞానానికి దూరంగా, పేదరికంలో 136వ దేశంగా, ఆకలి సూచిలో 101వ దేశంగా ఉన్నామని, 80కోట్ల మంది ప్రజలు రేషన్ బియ్యంకోసం ఎదురుచూస్తున్న మన దేశంలో అందాల పోటీలు అవసరమా..? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం నాగార్జునసాగర్‌లో నిర్వహించబోయే అందాల పోటీలను నిలిపివేయాలని లేకుంటే అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా నాయకులు అరుణ, కౌసల్య, కలమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మిర్యాలగూడ : పట్టణంలోని బకల్‌వాడీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–99లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం 26ఏళ్ల తరువాత స్థానిక ఓ హోటల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకొని కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో తాము గడిపిన తీపి గుర్తులను ఒకరినొకరు గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు ఇంద్రసేనారెడ్డి, అనంతరెడ్డి, నారాయణరెడ్డి, చాపల శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలి



తన తల్లి షాహా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ : ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం మదర్స్ డే సందర్భంగా దామరచర్ల మండలం దిలావర్‌పూర్ గ్రామ పరిధిలోని కెతావత్‌తండాలో తన తల్లి కెతావత్ షాహా విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. తల్లిదండ్రులు దైవంతో సమానమని, ముఖ్యంగా అమ్మ లేకపోతే జననం లేదని, గమనం లేదని అన్నారు. ఈ లోకంలో ప్రతి ఒక్కరికి తొలి గురువు తల్లేనన్నారు.

దేవరకొండ : సమాజంలో తల్లి ప్రేమ ఎంతో గొప్పదని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, గౌరవ అధ్యక్షుడు కొండ్ర శ్రీశైలంయాదవ్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వారు మాట్లాడారు. తల్లిదండ్రులను మించిన దైవం లేదని వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యతపై పిల్లలపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్ల శ్రీధర్‌గౌడ్, సంధ్యారెడ్డి, రాపోలు నిరంజన్, బత్తుల అమర్,తాళ్ల సురేష్, సుజిత్, విజయలక్ష్మి, సన్నీ, రవి, శేఖర్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**విశ్వాస పరిచర్య ప్రార్థన మందిరంలో..**

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని దుబ్బతండాలో విశ్వాస పరిచర్య ప్రార్థన మందిరంలో పాస్టర్ ధీరావత్ హన్యానాయక్ ఆధ్వర్యంలో ఘనంగా మాతృ దినోత్సవ వేడులను నిర్వహించారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ధీరావత్ రమాబాయి, అలివేలు, కోటమ్మ, సుధారాణి, మంగమ్మ, మారేమ్మ, రూతమ్మ, లీల తదితరులు పాల్గొన్నారు.

## వీర జవాన్ల త్యాగం వెలకట్టలేనిది




వీర జవాన్ల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : దేశ రక్షణ కోసం విరోచిత పోరాటాన్ని నిర్వహించి వీర మరణం పొందిన భారత జవాన్ల త్యాగం వెలకట్టలేదని మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ, తమ్మడబోయిన అర్జున్, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో గల మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ భవనంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో వీర జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమలగిరి అశోక్, జిల్లా అధ్యక్షులు మహేష్, జేఏసీ నాయకులు దాసరాజు జయరాజు, మురళి యాదవ్, బంజార ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశర ధనాయక్ వెంకటేశ్వర్లు, బ్రహ్మం, కాతోజు వినోద్‌కుమార్, రామచంద్రర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


**జవాన్లకు నివాళి**

భారత్–పాకిస్తాన్ యుద్ధం సమయంలో పాక్ సైన్యాన్ని ఎదిరించి మన దేశం కోసం సరిహద్దులో పోరాడి వీర మరణం పొందిన మురళినాయక్‌కు విజయ్ డ్రాయింగ్ క్లాసెస్ విద్యార్థులు చిత్రాలు వేసి వారికి నివాళులర్పించారు. దేశభక్తిని స్ఫూర్తిని రగిలించేందుకు అమరులేనని వారి త్యాగానికి గుర్తుగా చిత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ మాస్టర్ ఇనుగుర్తి విజయ్‌కుమార్, విద్యార్థులు కె.రత్విక్‌రెడ్డి, జి. వరేణ్యారెడ్డి, పి. ఆద్య, కె. లిఖిత, బి. ఉజ్వల, సీహెచ్ శృతికీర్తన, సాయి కార్తీక్, సీహెచ్ మోక్షిత్, పి. ఆర్య, ఎన్, సాత్విక ఉన్నారు.

## ఈఏపీసీఈటీ ఫలితాల్లో కేఎల్ఎన్ విద్యార్థుల ప్రతిభ



పావని



అశ్విత

మిర్యాలగూడ : వెలువడిన ఈఏపీసీఈటీ ఫలితాల్లో పట్టణంలోని కేఎల్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో సంద్రాల పావని 5068వ ర్యాంకు, ఎస్.అశ్విత 10389వ ర్యాంక్, పి.నిత్యా 12618వ ర్యాంక్, ఎం.హాసిత 18397వ ర్యాంక్, అగ్రికల్చర్ విభాగంలో జుహా అంజుమ్ 3315వ ర్యాంక్, అంజుం 11748వ ర్యాంకు సాధించగా 30వేల లోపు ర్యాంకులు 20మంది సాధిం,ఇది టాప్ 10ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు సాధించనున్నట్లు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పీఎల్ ఎస్.రెడ్డి, నరేందర్‌రెడ్డి, టి.హనుమంతరెడ్డి, చైతన్య ఆనంద్‌లు ఉన్నారు.

## వ్యాపారంగా విద్యావ్యవస్థ

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణలో విద్యా వ్యవస్థ వ్యాపారంగా మారిందని, విద్యా హక్కు చట్టాన్ని సమర్థంతంగా అమలు చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో 25శాతం ఉచిత విద్య ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. విద్యా హక్కు చట్టం –2009 ప్రకారం ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థల్లో 25శాతం మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు జయరాజ్, ఉపేందర్, మురళియాదవ్, గంగాధర్ తదితరులున్నారు.

## దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలు

- సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

త్రిపురారం : దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలని, ప్రతి వ్యక్తి దైవభక్తి కలిగి ఉండాలని సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో గౌడ కులస్తులు ఆరాధ్యాంగా కొలిచే కంఠమహేశ్వర స్వామి దేవాలయం నిర్మించి వనం ఎల్లమ్మ తల్లి, వనం మైసమ్మ తల్లి, ముత్యాలమ్మ తల్లి, బోడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటుగా కంఠమహేశ్వర స్వామి, సురమాంబ తల్లి కల్యాణం వైభవంగా నిర్వహించారు. దీంతో ఆదివారం లక్ష్మీపురం గౌడ కులస్తుల ఆహ్వానం మేరకు సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి హాజరై దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే అప్పలమ్మ గూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని సూర్య తండాలో శ్రీ భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామస్తులు మూకుమ్మడిగా గ్రామంలో దేవాలను నిర్మించుకోవడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, అనుముల శ్రీనివాస్ రెడ్డి, ధనావత్ భాస్కర్ నాయక్, బుసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కనగంటి సైదులు గౌడ్, నర్సింహ గౌడ్ మారయ్య గౌడ్, పరుశరాం గౌడ్,జానయ్య గౌడ్, ఎర్ర మల్లయ్య గౌడ్, బుచ్యాల అంజయ్య గౌడ్, బొలగాని ఎల్లయ్య గౌడ్, సత్యనారాయణ గౌడ్, కనగంటి రాజు ఆయా గ్రామాల ప్రజలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆదివారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద బిగ్ టీవి ఆధ్వర్యంలో మలక్‌పేట యశోద ఆస్పత్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య ఉప కేంద్రాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్లయ్య, సతీష్‌రెడ్డి, బోడ్యానాయక్, ప్రతాపరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

## కనీలాల్ ఆశయ సాధనకు కృషి చేయాలి



కనీలాల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జగదీశ్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య

దేవరకొండ : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ తండ్రి కనీలాల్ ఆశయ సాధనకు కృషి చేయాలని రాష్ట్ర మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కనీలాల్ నాయక్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని దేవరకొండ మండలం రత్యతండాలో ఏర్పాటు చేసిన కనీలాల్ కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రత్యతండా పంచాయతీగా ఏర్పడ్డ మొదట్లో మొట్టమొదటి సర్పంచ్‌గా ఎన్నికై ప్రజా సంక్షేమం కోసం ఆయన ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. ప్రజా క్షేత్రంలో ఉన్న నాయకులు వారు చేసిన సేవలతోనే ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

మిర్యాలగూడ : స్వాతి నక్షత్రం సందర్భంగా దామరచర్ల మండలంలోని వాడపల్లిలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాధవి దంపతులు స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరిపై స్వామివారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దంపతులు

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా



దేవరకొండ ఎంపీపీఎస్‌లో స్కిప్పింగ్ ఆడుతున్న విద్యార్థినులు



చింతపల్లి మండలం కురంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

- వేసవి శిక్షణ శిబిరాలకు విశేష స్పందన
- మే 15వ తేదీ వరకు శిబిరాలు
- సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్న ఉపాధ్యాయులు

దేవరకొండ : వేసవి కాలం వచ్చిందంటే చాలు పట్టణాల్లో వివిధ క్రీడలు, నృత్య శిక్షణ శిబిరాలకు ఉండే డిమాండ్ చెప్పనక్కరలేదు. ఆయా శిబిరాల్లో క్రీడలు, వివిధ శిక్షణలు పొందేందుకు పెద్ద సంఖ్యలో పిల్లలు క్యూ కడుతుంటారు. అయితే ఆర్థికంగా అంతంత మాత్రంగా ఉండే వారు మాత్రం ఈ శిక్షణ శిబిరాలకు కొంత దూరమవుతున్నారు. ఈ నేపథ్యంలో మొట్ట మొదటి సారిగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభించారు. ఈ శిబిరాల్లో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. అంతేగాకుండా విద్యార్థులకు కొత్త అంశాలపై విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించే విధంగా శిబిరాలను రూపొందించారు. దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల్లో పలు ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 1నుంచి ప్రారంభమైన శిబిరాలు 15వ తేదీ వరకు కొనసాగనున్నాయి. కాగా ప్రాథమిక పాఠశాల విద్యార్థుల నుంచి ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు.

**సద్వినియోగం చేసుకోవాలి**



ప్రభుత్వ పాఠశాలలో ఈ ఏడాది ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు శిబిరాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి.ఈ శిబిరాల్లో వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తుండటంతో ఆసక్తి పెంపొందుతుంది.

- లింగంపల్లి మధు, జెడ్పీహెచ్ఎస్, చందంపేట

**శిక్షణ ఇచ్చే అంశాలు**

నిన్న మొన్నటి వరకు చదువులు, పరీక్షల్లో మునిగి తేలిన విద్యార్థులకు కొంత ఆట విడుపుతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆయా అంశాలపై పాఠశాలల్లో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాల్లో అవగాహన కల్పిస్తూ శిక్షణ అందిస్తున్నారు. ఆటపాటలతో పాటు స్పోకెన్ ఇంగ్లీష్, స్టోరీ టెలీ, కమ్యూనికేషన్ స్కిల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్, వెబ్ డిజైనింగ్, యోగా, ఇండోర్ గేమ్స్, క్రియేటివ్ ఆర్ట్స్, డ్రాయింగ్, పెయింటింగ్ వంటి అంశాల్లో అనుభవజ్ఞులైన వలంటీర్లతో విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తున్నారు. ఆయా మండలాల ఎంఈఓలు ప్రతి నిత్యం శిక్షణ శిబిరాలను పర్యవేక్షిస్తున్నారు.